# 8. రైళ్ళు మళ్లా నడిచాయి

చాల పెద్దవర్షం పడుతుంటే టనల్‌లోకి ప్రవేశించాను. టనల్ చివరివరకూ నడిచి అక్కడ ఉండిపోయాను. అక్కడ మరో నలుగురు కొండవాళ్లు కనిపించారు.

వాళ్లు ఎటువంటి పరిస్థితులలోనైనా ముందుకుపోగలరు. వాళ్లుకూడా ఆగిపోయారంటే కొంప మునిగిందన్నమాటే.

ఎడంచేతివేపు కొండ ఉంది. దానిమీదనుండి రైలులైను పైకి రాళ్లు పడుతున్నాయి. వర్షం ధారాపాతంగా కురుస్తోంది. వాగులు పొంగిపారుతున్నాయి. బండరాళ్లు పడకపోతే అందరం ముందుకు పోయేవాళ్లమే.

గిరిజనులతోపాటు నేను కూడా అక్కడ చాలసేపు ఉన్నాను. ఉక్కగా ఉంటే వాటర్‌ప్రూఫ్‌కోటు విప్పి పక్కను పెట్టాను. నేను చిమిడిపల్లి స్టేషనులో పనిచేస్తున్నాను. అరకు వేపున ఉన్న మా పక్కస్టేషను బొర్ర గుహలు. అక్కడ వైర్‌లెస్ సెట్‌మీద పనిచేస్తున్న అతను వెంటనే సెలవుమీద వెళ్లిపోవాలి. అతని భార్యకు, విజయనగరంలో, ప్రమాదంగా ఉంది. మా యినస్పెక్టరు మరీ మరీ చెప్పి నన్ను పంపించాడు. ఏవిధంగానేనా, బొర్ర స్టేషనుకు పోయి అతనిని సెలవుమీద విడిచిపెట్టమని ఆజ్ఞాపించాడు.

టనెలు దాటిన తరువాత కొద్ది దూరంలో నలభై అడుగులు లోతువరకు రైలులైనును కొండవాగు కోరేసింది.

ఈ రాళ్లను దాటిపోయినా, వర్షంలో వాగుచేసిన గోతిని దాటి వెళ్లడం చాల కష్టమవుతుంది.

కాని ఏం చేయడం?

గిరిజనులు ముందుకుపోతే, వాళ్లతోపాటు నేనుకూడా పోగలను. వాళ్లను కూడా కాదని నేను సాహసిస్తే చనిపోవడం తప్ప మరే ప్రయోజనం సిద్ధించదు.

నేను చిమిడిపల్లి స్టేషనులో పనిచేస్తున్నాను అని చెప్పాను కదా - అక్కడికి బదిలీమీద వచ్చి అయిదు సంవత్సరాలయింది. నాకు ప్రమోషనిచ్చి పంపించడంచేత అక్కడికి రాకతప్పలేదు. వచ్చిన మొదటి రెండు సంవత్సరాలలోను కాపరం పెట్టలేదు. ఒంటరిగా స్టేషన్లో ఉంటూ, ఎవడింట్లోనో తింటూ, ఆ వూరినించి బదిలీమీద వెళ్లిపోవాలని విశ్వప్రయత్నాలు చేశాను. ఏవీ కలిసిరాలేదు - ఉద్యోగం కావాలంటే చిమ్మిడిపల్లిలోనే పనిచేయాలి - అక్కర్లేదంటే లోకంకన్న విశాలమైనది మరేదీలేదు.

ఈ కాలంలో ఉద్యోగాలు సులువుగా దొరకడం లేదు. పది సంవత్సరాల తరవాత ప్రమోషను దొరికింది - జీతానికి లోటులేదు - ఇల్లిస్తారు. గౌరవంగా బతకడానికి ఇంతకన్న వేరే మార్గం లేదు. నేను ఇన్ని ఇబ్బందులతోను చివరకు రాజీపడి, మూడు సంవత్సరాలకిందే ఇల్లు తీసుకొని భార్యను తెచ్చుకున్నాను. నేనొక్కడినే కాదు, నావంటివాళ్లు మరో ముప్ఫయిమంది అక్కడ పనిచేస్తున్నారు.

ఆంధ్రదేశంలో చాలమందికి ఈ చిమిడిపల్లి స్టేషను గురించి అంతగా తెలియదు. అందరికీ అరకులోయ గురించి తెలుసు. ఈమధ్య చాల ఫిల్ములకు అక్కడు షూటింగు జరగడంతో అరకులోయ లోకవిఖ్యాతమయింది,

అరకులోయ రమారమి మూడువేల అడుగుల ఎత్తులో ఉంది. శృంగవరపుకోట వరకు సమతలంలో పోయిన రైల్వేలైను అక్కడనుండి కొండలమీదకు ఎక్కడం ప్రారంభిస్తుంది. అరకు చేరేసరికి రమారమి ఏభై టనెల్సు గుండా పోతుంది. శృంగవరపు కోటకు, అరకు స్టేషనుకు మధ్య దారిలో చిమిడిపల్లి ఉంది.

లైనుకు ఎడమవేపు కొండ, కుడివేపు లోతుల్లో రైల్వేక్వార్టర్లు - దానిని పల్లె అనాలో, గ్రామమనాలో తెలియదు - రైల్వేకాలనీతప్ప అసలైన చిమిడిపల్లి గిరిజన గ్రామం మరి కొంతదూరంలో ఉంది. అరకువేపు బొర్రగుహలు, కరకవలస, సెమిలిగుడ స్టేషన్లున్నాయి - శృంగవరపుకోట వేపు టైడా, శివలింగపురం, బొడ్డవార స్టేషన్లున్నాయి. - - ఇంతలో గిరిజనులు లేచారు - వాళ్లతోపాటు నేనూ లేచాను - ఆ రోజు ముందుకెళ్లే అవకాశాలులేవని వాళ్లు వెనక్కు తిరిగిపోయారు. నేను కూడా వాళ్లవెంబడి టనెలు వెనుకకు నడిచి చాల ప్రయాసతో స్టేషను చేరుకున్నాను - మా యినస్పెక్టరు నాకోసం ఎదురుచూస్తుంటే అతనితో దారిలోని అడ్డంకుల గరించి చెప్పాను .

"రక్షించావు - ఏ వాగులో నువ్వు కొట్టుకుపోతే, ఇక్కడ పనిచేయడానికి మరెవడూ లేడు - మరెవడూ రాడు కూడా!"

మా యినస్పెక్టరు ట్రాలీ పట్టుకొని శృంగవరపు కోటవేపు వెళ్లిపోయాడు.

అతను వెళ్లేసరికి ఎగువభాగాన్నే లైన్లుపోయాయి. ఆ రాత్రి దిగువ భాగంవేపు కూడా లైను పోయింది. టైడా పదమూడో నంబరు టనెలు దగ్గిర, కొండవాగు మీటరు ఎత్తులో ఇసుక మేట వేసింది. శివలింగపురం దగ్గిర బండరాళ్లు పడి లైను పాడయింది బొర్రగుహలు, కరకవలస స్టేషన్ల మధ్య కొండవాగు నలభై అడుగుల లోతుకు లైను కోరేసింది - ట్రాక్షన్ స్తంభాలు పోయాయి - సిగ్నల్ బాక్సులు, కేబిళ్లు చాల దూరం కొట్టుకుపోయాయి - ఇంకా ఇంకా లైను చాల చోట్ల పాడయింది.

చిమ్మిడిపల్లి నడిసముద్రంలో భూకంపానికి ఏర్పడిన ద్వీపంలా నిలిచిపోయింది.

ఇనస్పెక్టరు వెళ్లిపోయిన తరువాత స్టేషనులో చాలసేపు కూర్చున్నాను, మాస్టరు భోజనం

చేసివచ్చేవరకు.

చిమ్మిడిపల్లిలో కాపురం పెట్టి స్థిరపడ్డ తరువాత కొద్దికాలం గట్టునపడ్డ చేపలా బాధ పడ్డాను - విశాఖపట్నంలో ఉన్నప్పుడు వారానికో సినిమా, మనసయినపుడు మంచి హోటలుకి పోయి మసాలా దోసె వేయించుకొని తినడం, స్నేహితులతో బీచి ఒడ్డున కూర్చుని నవ్వుతూ కబుర్లాడడం, రోజూ దినపత్రిక, వారానికి రెండు మూడు మాగజైనులు, ఈ విధంగా జీవితాన్ని మూడు పూవులు, ఆరు కాయలుగా గడుపుతున్న నాకు, ఉద్యోగంలో ప్రమోషను వచ్చి ఈ వూరిలో చేరక తప్పిందికాదు.

అవన్నీ నిన్నటి సంగతులు.

ఇప్పుడు మహమ్మదు కొండకు వచ్చినాడు.

చిమ్మిడిపల్లిలో స్నేహితులూ లేరు - సినీమాలు లేవు - కాఫీ హోటళ్లు లేవు - దినపత్రిక, వారపత్రికలు అమ్మరు. అసలు తిరిగిరావడానికి రోడ్లు లేవు - కొండ చరియలలో ఇళ్లు కట్టారు. మెట్లు దిగితే కాని ఇల్లు చేరం - మెట్లెక్కితే గాని ఉద్యోగానికి పోలేం - అందుచేత స్కూటర్లు, మోటారు సైకిళ్లు వంటివి ఎక్కి హాయిగా తిరిగి రాడానికి వీలవదు - విశాఖపట్నంలో జనసముద్రంలో తేలేవాడిని -ఇక్కడ అడుగులేని అగాధంలో మునిగిపోయాను.

ఏం చేయడం?

చిమ్మిడిపల్లికి అన్నీ మైనస్‌పాయింట్లు కావు - ఉండడానికి సరిపడ మంచి యిల్లు యిచ్చారు - విశాఖపట్నంలో ఆరు నెలలకో యిల్లు మారేవాళ్లం - సినిమా ఖర్చు అసలు లేదు - అక్కడయితే నెలకు నూట ఏభై రూపాయల వరకు ఖర్చయ్యేది - ఆటోలకి రిక్షాలకి డబ్బు తగలెయ్యనక్కరలేదు - అద్దె యిళ్లలో నీటి యిబ్బంది విధిగా ఉండేది - ఇక్కడ పుష్కలంగా నీరు సప్లైఅవుతుంది - రోడ్లంటూ లేవు - అందుచేత దుమ్ము, ధూళి లేవు. పొల్యూషను ఈ ప్రాంతాలకు సోకదు - ఉండేది పర్వతాలమీద, అడవుల నడుమ, చుట్టాల బెడదలేదు - వారం రోజుల వరకూ ఉండడానికి వచ్చిన దగ్గిర చుట్టాలు కూడా రెండో రోజే వెళ్లిపోయేవారు. విశాఖపట్నంలో ప్రతీనెల రెండు వందలో మూడు వందలో అప్పయేది. ఇక్కడ మాత్రం జేబులో ఎప్పుడూ డబ్బే ఉంటున్నది - ఎవరినీ అప్పడగలేదు - చేసిన అప్పులు కూడా తీర్చాము.

అందుచేత నరకంలో నివసించ వలసినప్పుడు దానిని స్వర్గంగా మార్చుకోవాలి.

ఆ ప్రయత్నమే నేను చేశాను -

రోజూ ఉదయం వచ్చే పాసింజరులో దినపత్రిక తెప్పించుకునేవాడిని - వారపత్రికలు కూడా ఏ గార్డో కొనిపడేసేవాడు.

అప్పుడప్పుడు ఏ స్నేహితుడో మాసాల దోసె శృంగవరపుకోటనుండి పార్శిలు కట్టించి

తెచ్చేవాడు - అరకులో ఒకాయనను పట్టుకొని వారానికో రెండు కొత్త సినీమాలు వీడియోలో చూపించే ఏర్పాటులు చేశాను - ప్రతి ఉదయం పదిగంటలకు ఎగువకు పోయే పాసింజరు, సాయంకాలం దిగువకు పోయే పాసింజరు. విధిగా మా వూళ్ళో ఆగితే, స్టేషను ప్లాట్‌ఫారమ్ మీద నిలబడి వాళ్లని చూసి ఆనందించేవాడిని - ఏ పనిచేయడానికేనా కావలసినంత కాలం చేతిలో ఉండడంచేత, శ్రద్ధగా వ్యవహరించి చక్కగా ముగించేవాడిని - ఆలోచించడానికి, భార్యతో మనసువిప్పి మాట్లాడుకోడానికి తీరిక దొరికి ఆనందించేవాడిని - రైళ్ళు క్రాసింగు జరిగినప్పుడు, ఆ యింజను డ్రైవరుతోను, గార్డుతోను లోకం సంగతులు మాట్లాడి కాలం సద్వినియోగం చేసేవాడిని - మరో ఆరు నెలలయేసరికి చిమ్మిడిపల్లి అసలు స్వర్గం కాకపోయినా త్రిశంకు స్వర్గానికి తీసిపోనట్లుగా తీర్చిదిద్దాను.

చిమ్మిడిపల్లి పనిష్‌మెంట్ స్టేషనని కూడా మరచిపోయాను.

ఇంతలో స్టేషను మాస్టరు భోంచేసి వచ్చాడు.

"గుర్నాధరావుగారూ! ఏమిటి విశేషం?" ప్రశ్నించాను.

"విశేషాలకేమిటి? కొంతకాలం వరకూ ఎటువంటి మార్పూ ఉండదు." అన్నారతను.

"కనీసం ఎన్నాళ్లు పడుతుంది లైను బాగయ్యేసరికి?"

"ఒక నెల నుండి మూడునెల్ల వరకూ . . "

మెట్లు దిగి ఇంటివేపు నడిచాను - ఏ పనీ లేదు - విశ్రాంతిగా పడుక్కోవచ్చుగదా! ఎందుకింత దుర్భరంగా పరిస్థితులు మారాయి?

అప్పుడు నాకు జ్ఞానోదయమయింది.

రైళ్ల నడిచేవి - ప్రజలు ఎగువకు, దిగువకు పోయేవారు - మాట్లాడేవారు - నవ్వుకునేవారు - కొత్త ముఖాలు - పాత ముఖాలు - పత్రికలు, కిరాణా సామాన్లు, లోకం పోకడలూ అన్నీ రైళ్లతో వచ్చేవి -

ఇప్పుడు పూర్తిగా రైళ్లు ఆగిపోయాయి.

నాకు ఇప్పటికీ జ్ఞాపకం - మే నెల తొమ్మిదో తారీకు రాత్రి విశాఖపట్నం వెళ్లవలసిన పాసింజరు దాటిపోయింది - దాని తరువాత ఒక గూడ్సుబండి అరకువేపు వెళ్లింది.

తరువాత రైలన్నది నేటివరకూ తిరగలేదు.

ఇంకా నెల్లాళ్లపాటు, ఇంకా విషమిస్తే మరోమూడు నెల్లవరకూ ప్రపంచం స్తంభించిపోతుంది.

ఇంట్లో అడుగుపెట్టాను.

పొయ్యికిందికి, పొయ్యి పైకి ఉంటే చాలు - ఆడవుల్లో కాపురం కాబట్టి పొయ్యి కిందికి పరవాలేదు -పొయ్యి పైకి - - బియ్యం ఎన్నుంటాయి - ఎవరికీ ఇటువంటి పరిస్థితి వస్తుందని

తెలియదు - లేకపోతే అప్పో సప్పో చేసి ఇంటికో బస్తా బియ్యం పడేసుకునే వాళ్లం -

రెండు రోజుల క్రింద శృంగవరపు కోటనుంచి మాకోసం రేషను పంపించారు -ట్రాలీలో ఒక అరబస్తా బియ్యం, కిలోపప్పు, కిలో మిరపకాయలు, ఈవిధంగా పంపించారు - ఎవరిళ్లలోను సరకులు నిలవ ఉండడం లేదు - అందరం పంచుకుంటే ఏపాటి వస్తాయి?

బియ్యం మరో నాలుగు రోజులకు మించి రావని సతీమణి చెప్పింది.

గవర్నమెంటు రేషను భీంపోలులో దొరుకుతుంది. ఆ గ్రామం చిమిడిపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడికి పోడానికి అడవుల్లోంచి, కొండలమీంచి నడవాలి - ఈ కొండలలో వర్షాలు కురుస్తునే ఉన్నాయి. రేషను కావాలంటే జారులో, బురదలో నడిచి, బరువు భుజానికెత్తుకొని తీసుకు రావాలి. ఆ యేర్పాటులు చేసేసరికి మా యింట్లో బియ్యం నిండుకున్నాయి. ఆ రోజు నా భార్య నూకలతో పులిహోర చేసినప్పుడు దాని రుచి దివ్యంగా తోచింది.

మాకు పాలు లేవు - పెరుగు లేదు - కూరలు లేవు - కొండరాళ్లలో అట్టే పండించుకోలేదు - ఎవరి పెరట్లోనో వేసిన అరటి చెట్టు గాలికి విరిగిపడితే, కీసరకాయలతో కూర వండుకున్నాం. నీటి చాలులో ముల్ల తోటకూర దొరికితే అబ్బురంగా ఉడికించుకొని తిన్నాం.

సారా తాగేవాళ్లు పనిపాటు లేకుండా తాగి మా నెత్తిమీదే తందనాలు పాడుతుంటే వాళ్లని గిరిజన గ్రామానికి తగిలేశాము -

ఏదో రోజు లైను బాగుపడుతుందని, అపుడు రైళ్లు నడుస్తాయని, అంతవరకు ప్రాణాలను నిలబెట్టు కోవాలని అన్ని ప్రయత్నాలు చేశాం. కాని ఆ పుణ్యాదినం మురిపిస్తూ దూరం దూరంగా తప్పించుకుంది.

ఒకరోజున, విశాఖపట్నంలో మా అమ్మగారికి చాల కఠినంగా ఉందని, హాస్పిటలులో చేర్చారని, నన్నూ నా భార్యను చూస్తామంటున్నారని ఎలాగేనా రావలసిందని వైర్‌లెస్ మెసేజి వచ్చింది.

నా భార్యకూడా నాతో బయలుదేరతానంది - నాకంటె దృఢమయిన మగాళ్లకే సాధ్యంకాని పని - ఆమె ఎలా వెళ్తుంది - నేనొక్కడినే మరో స్నేహితుడిని సాయం తీసుకొని బయలుదేరాను

చాల శ్రమలు పడి విశాఖపట్నం చేరుకున్నాను.

తిరిగి చిమిడిపల్లి రావడమే ప్రళయమయింది.

శృంగవరపుకోట - అక్కడనుండి టైడా - మరో బస్సు టైడావరకు - ఆ బస్సు డమకు దగ్గిర ఆగిపోయింది - అక్కడనుండి మట్టిరోడ్డు అయిదు కిలోమీటర్లు నడిచాం - కొండ చివర షాడా అన్న మరో వూరు - అక్కడనుండి మూడు కిలోమీటర్లు -కొండవాగులు దాటి, అడవులు దాటి - నదులు దాటి - -

ఉదయం పదిగంటలకు బస్సు దిగాం.

సాయంకాలం నాలుగు గంటలకు చిమ్మిడిపల్లి చేరాం.

వర్షం కురుస్తూనే ఉంది -

తుక్క తడిసిపోయాం -

ముళ్లపొదలకు శరీరం గాయం పడింది -

ఇల్లు చేరి బట్టలు మార్చుకుని మంచంమీద పడ్డాను -

మళ్లా తెలివి వచ్చేసరికి రెండు రోజులయింది -

తీవ్రమయిన జ్వరం -

డాక్టరుకి శృంగవరపు కోట మెసేజ్ యిచ్చారు -

ఎవరినేనా పంపితే మందిస్తానన్నాడు -

రోజు రోజుకీ జ్వరం హెచ్చింది -

ఒక రాత్రి చెమటలు పట్టి పైకి వచ్చి వాకిట్లో నిలుచున్నాను -

పైకి చూస్తే అనంతమైన ఆకాశం -చిన్న చిన్న మబ్బులు - మధ్యన నక్షత్రాలు - చేతులెత్తి ఆకాశంవేపు చూస్తున్నాను -

నేనో పెద్ద అగాధంలో ఉన్నాను - దానికి అడుగంటూ లేదు. పైకి పోడానికి మెట్లున్నాయ్యా! చీకటిలో అదికూడా కనిపించడం లేదు - నేను కిందికే జారుతున్నాను -

ఎంతవరూ జారాలి?

దానికి అడుగుంటే కదా!

నాకు నీరసం వచ్చి పడిపోయాను -

మరి నాలుగు రోజుల తరువాత తెలివి వచ్చింది -

నా భార్య నూకల జావ నోట్లో పోస్తోంది.

ఇంతలో స్టేషను మాస్టరు పరుగెత్తుకొని వచ్చాడు.

"ఇవాళ నుంచీ రైళ్లు నడుస్తాయి. పాసింజరు మరో గంటలో వస్తుంది"

నాకు చెప్పలేనంత బలం వచ్చింది.

"అయ్యా! నన్ను ప్లాట్‌ఫారమ్ మీదికి తీసుకుపోండి. వార్త వింటేనే ఏనుగంత బలం వచ్చింది - చూస్తే తిరిగి మరింత బలం పుంజుకుంటుంది.

అప్పటికి మూడునెల్ల తరువాత రైళ్లు మళ్లా నడుస్తున్నాయి.

ఈ రైళ్లు మాకూ బయటి ప్రపంచానికి సంబంధం కలిగించే జీవధారలు.